# జూ పార్కులో ఖడ్గ మృగాన్ని దత్తత తీసుకున్న ఇషిక రంజన్

**చార్మినార్,ఆగష్టు 18 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని ఖడ్గ మృగాన్ని రాష్ట్ర ఐటి,పరిశ్రమలు,వాణిజ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ కుమార్తె ఇషిక రంజన్ ఆరు నెలలు పాటు దత్తత తీసుకున్నారు.రాష్ట్ర ఐటి,పరిశ్రమలు,వాణిజ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి జూపార్కును సందర్శించారు.ఈ నెల 26వ తేదీన ఇషిక రంజన్ జన్మ దినం సందర్బంగా జూపార్కులో ఖడ్గ మృగాన్ని దత్తత తీసుకున్నారు.జూ పార్కు క్యూరేటర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్‌కు ఇషిక రంజన్ లక్ష రూపాయల చెక్కును అందజేశారు.జూపార్కులోని ఏనుగుల ఎన్‌క్లోజర్‌తో పాటు పలు జంతువుల ఎన్‌క్లోజర్‌లను రాష్ట్ర ఐటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తమ కుటుంబ సభ్యలతో కలిసి సందర్శించారు.ఈ కార్యక్రమంలో జూపార్కు అధికారులు పలువురు పాల్గొన్నారు.


రాష్ట్ర ఐటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ కుమార్తె ఇషిక రంజన్ జూ పార్కు క్యూరేటర్ సునీల్ ఎస్.హీరామత్‌కు లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న దృశ్యం

హైదరాబాద్ వార్త




మినీ శిల్పారామంలో జరిగిన రాఖీ పండుగ వేడుకల్లో ఆకట్టుకున్న సాంప్రదాయ నృత్యాలు దృశ్యం.



# రాఖీ పండుగ వేడుకలు

## -ఆకట్టుకున్న సాంప్రదాయ ప్రదర్శనలు

**ఉప్పల్, ఆగస్టు 18 ప్రభాతవార్త :**
ఉప్పల్ మినీ శిల్పారామంలో జరిగిన రాఖీ పండుగ వేడుకలు ఆదివారం ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, వనవాసి కల్యాణాశ్రమం నిర్వహకులు కె.రామచంద్రయ్య, జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన్ కార్యదర్శి ఎం. సూర్యనారాయణమూర్తి, ప్రముఖ కవి పి.భాస్కర్‌యోగి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు రాష్ట్ర గవర్నర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ ప్రసంగం పలువురిని ఆకట్టుకుంది. దేశ ఐక్యతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# గచ్చిబౌలి పబ్‌లో మద్యం మత్తులో చెలరేగిన మందుబాబులు

## -పబ్‌కు వచ్చిన యువతిపై వేధింపులు
## - ప్రశ్నించిన యువకుడిపై దాడి
## -కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు

**గచ్చిబౌలి, ఆగస్టు 18 ప్రభాతవార్త**
నగరంలోని పబ్‌లు మద్యం మత్తులో దాడులు, ఘర్షణలకు వేదికలుగా నిలుస్తున్నాయి. ఓ వైపు పబ్‌లు నిబంధనలకు విరుద్దంగా వ్యవహరిస్తుండడం, మరోవైపు ఎటువంటి నియంత్రణ లేకుండా పోతుండడంతో నగరంలో పబ్‌లలో తరచూ దాడుల ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పబ్‌లకు వచ్చే కస్టమర్లు మద్యం మత్తులో ఇతరులతో గొడవలకు దిగుతుండగా, కొన్నిసార్లు పబ్ నిర్వాహకులు, బౌన్సర్లు సైతం కస్టమర్ల మీద దాడులు చేసిన ఘటనలు గతంలో వెలుగు చూశాయి. తాజాగా గచ్చిబౌలిలోని ఓ పబ్‌లో పీకలదాకా మద్యం సేవించిన యువకులు పబ్‌కు వచ్చిన ఓ యువతిని వేధించారు. యువతితో పాటు పబ్‌కు వచ్చిన యువకుడు ప్రశ్నించడంతో యువకుడు, మరో యువతి మీద దాడి చేశారు. పబ్ నిర్వాహకులు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం, భద్రతా చర్యల్లో విఫలమవుతుండడమే తరచూ పబ్‌లలో చోటుచేసుకుంటున్న ఘటనలకు కారణమవుతున్నాయని తెలుస్తుంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో తాజాగా చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... బండ్లగూడ సన్‌సిటీలో నివాసం ఉండే ప్రశాంత్ కుమార్ తివారీ శనివారం రాత్రి 7.30కు తన భార్య, మరో యువతితో కలిసి గచ్చిబౌలి ఎస్ఎన్ఎల్ టెర్మినల్స్‌లో ఉన్న క్రాస్ బ్రేడ్ క్లబ్‌కు వచ్చాడు. అర్థరాత్రి 1 గంట ప్రాంతంలో ప్రశాంత్‌కుమార్, ఇద్దరు యువతులు పబ్ నుంచి బయటకు వస్తుండగా, మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు ప్రశాంత్ కుమార్ భార్యను వేధించారు. దీంతో ప్రశాంత్‌కుమార్ సదరు యువకులను నిలదీయగా, మద్యం మత్తులో ఉన్న యువకులు ఒక్కసారిగా ప్రశాంత్‌కుమార్ మీద పడి దాడి చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువతుల మీద సైతం దాడి చేశారు. పబ్ నిర్వాహకులు వచ్చి ఇరువర్గాలను పబ్ నుంచి బయటకు పంపించి వేశారు. పబ్ బయట సైతం మరోసారి ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. తమపై జరిగిన దాడి విషయమై ప్రశాంత్‌కుమార్, ఇద్దరు యువతులు ఆదివారం గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రశాంత్‌కుమార్‌తో పాటు ఇద్దరు యువతుల మీద దాడి చేసిన యువకులను ప్రస్తుతానికి గుర్తించలేదని, సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపడుతామని పోలీసులు తెలిపారు.






# ఆక్రమణలపై హైడ్రా దూకుడు

## -చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే లక్ష్యంగా
## -ఆక్రమణలు గుర్తించడం..ఆలస్యం లేకుండా తొలగించడం
## -ఉక్కుపాదం మోపుతూ నిర్ధాక్షిణ్యంగా కూల్చివేతలు
## -అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్న హైడ్రా చర్యలు
## -ఒత్తిళ్ళు ఉన్నా తగ్గేదేలేదంటున్న కమిషనర్ : ఏ.వి.రంగనాథ్


ఎర్రకుంటలోని భారీ బహుళ అంతస్తులు కూల్చివేస్తున్న దృశ్యం(ఫైల్)

**దుండిగల్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ' హైడ్రా '..ఈపేరు వింటేనే కబ్జాదారుల గుండెల్లో వణుకు పుడుతుంది. విశ్వనగరిలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, పార్కులను చెరబట్టిన భూరాబంధులపై విరుచుకు పడుతూ ఆక్రమణలకు విముక్తి కల్పిస్తున్నారు. అడ్డగోలుగా ఆక్రమణలకు పాల్పడుతున్న కబ్జాదారులతో పాటు సహకరిస్తున్న ఖద్దర్‌లకు సైతం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేస్తూ.. ఆక్రమణలకు పాల్పడితే ఎంటివారినైనా ఉపేక్షించేంది లేదు..ఇక మీ ఆటలు సాగవు..ఆక్రమణలు కుదరవు అంటూ కఠినంగా వ్యవహారిస్తుంది హైడ్రా. హెచ్ఎండిఏ పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాల ఆక్రమణలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు మాప్రభుత్వంలో జరగనివ్వం ఆక్రమణలపై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. దానిలో భాగంగానే ప్రభుత్వం ' హైదరాబాద్ డిసాస్టర్ రెస్పాన్స్ ఆండ్ అస్సెట్స్ మానిటరింగ్ అండ్ ప్రోటెక్షన్' హైడ్రా టీమ్‌ను ఏర్పాటు చేసింది. ఈవిభాగానికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా విధి నిర్వాహణలో బాధ్యాతయుతంగా వ్యవహరించే సింగంలాంటి అధికారి ఏ.వి.రంగనాథ్ ఐపిఎస్‌ను కమీషనర్‌గా నియమించింది. ఆక్రమణలపై కొరడా ఝుళిపించేందుకు ప్రభుత్వం ఓ విభాగాన్ని ఏర్పాటు చేస్తుంది ఇవి గతంలో మాదిరిగానే వస్తాయ్..పోతాయ్ అని కబ్జాదారులు బావిస్తున్న తరుణంలో సదరు విభాగం కమీషనర్ ఏ.వి.రంగనాథ్ తెలియడంతో ఒక్కసారిగా వారిలో అలజడి మొదలైంది. హైడ్రా కమీషనర్‌గా భాద్యతలు చేపట్టిన రోజు నుండే ఆక్రమణలపై ఆరా తీయడం మొదలు పెట్టారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిశీలిస్తూ ఆక్రమణలపై చర్యలకు చేపడుతున్నారు.

**చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే లక్ష్యంగా......**

విశ్వనగరిలోని చెరువుల ఆక్రమణలు ప్రధాన సమస్యగా మారింది. కాంక్రీట్ జంగల్‌గా మారిన హైదరాబాద్‌లో చెరువులు, గొలుసుకట్టు నాలా ఆక్రమణలతో భూగర్భ జలాలు అట్టడగు స్థాయికి పడిపోయాయి. ఆక్రమణల కారణంగా వర్షకాలంలో వరద నీరు రోడ్లపై పోటేత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఏదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలంటే ముందుగా నాలాలు, చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సిందే లేదంటే రానున్న రోజుల్లో సమస్య మరితం జఠిలంగా మారే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వం సమస్యను హైడ్రా విభానికి అప్పగించింది. హైడ్రా కమీషనర్ ఏ.వి.రంగనాథ్ మహానగరం పరిధిలోని చెరువులు, నాలాల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ విభాగాల అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించి ఆక్రమణల వివరాలను తెలుసుకుంటున్నారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను సైతం పరిశీలిస్తున్నారు. ఫిర్యాదులు అందిన ప్రాంతాలను కమీషనర్ రంగనాథ్ స్వయంగా వెళ్ళి సందర్శించి ఆక్రమణలను పరిశీలించి ఆలస్యం లేకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాలను సైతం చెర నుండి విముక్తి కల్పించి రక్షణ కల్పించడంలో హైడ్రా విజయవంతంగా దూసుకుపోతుంది.

**ఆక్రమణలు అని తేలితే...నేల మట్టం చేయడమే...**

గతంలో కబ్జాలపై చర్యలు ఏలా ఉండేవి అంటే సంబంధిత అధికారులు వెళ్ళి అలా కూల్చివేతలు ప్రారంభించారో లేదో ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల నుండి ఒత్తిడి రావడం లేదా కబ్జాదారులతో మమేకం అవడం జరిగేది ఏమో అరకొరగా జరిపి వెళ్ళి మరలా అటువైపు కన్నెత్తి చూసేవారు కాదు. కాని ఇప్పుడు అలా కాదు. ఆక్రమణలు తేలితే చాలు హైడ్రా ఏక్షణానో అక్కడికో వస్తుందో తేలియదు. ఆక్రమణలు జరిగిన ప్రాంతానికి చేరుకున్న హైడ్రా టీమ్ ముందుగా ఎటువంటి అవాంచనీయ సంఘటన చోటు చేసుకోకుంగా ఆప్రాంతాన్ని తమ ఆధీనంలో తీసుకుంటుంది. భారీ బందోబస్తు మధ్య భారీ మిషనరీస్ సహాయంతో కూల్చివేతలు ప్రారంభించి అక్రమ నిర్మాణాలు పూర్తిగా నేలమట్టం చేసేస్తుంది. పని పూర్తి అయ్యే వరకు ఎవరు చేప్పిన వినేది లేదు. తమ పని తాము చేసుకుంటూ పోతాము అడ్డుపడితే కటకటాలే అంటూ హెచ్చరిస్తూ చర్యలు కొనసాగిస్తుంది.

**రాజకీయ నేతల ఒత్తిళ్ళు ..తగ్గేదేలే అంటున్న హైడ్రా కమీషనర్**

ఆక్రమణలపై హైడ్రా దూకుడు పలువురు రాజకీయనాయకులకు మింగుడు పడడం లేదు. రాజేంద్రనగర్ పరిదిలోని ఓ చెరువును పూడ్చి వేసిన వెంచర్‌లోని నిర్మాణాలను తొలగిస్తుండడంతో ఓ ఎమ్మెల్యే అడ్డుకునేందుకు వెళ్ళగా ఆయన్ని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. బాచుపల్లి ఎర్రకుంట పరిధి మూడు భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలను, గండిపేట చెరువు ఎఫ్‌టిఎల్‌లోని నిర్మాణాలను భారీ ప్రొక్లెయినర్స్‌తో సహాయంతో పూర్తిగా నేలమట్టం చేశారు. దీంతో హైడ్రా కమీషనర్ ఏవి.రంగనాథ్ ఒత్తిళ్ళు వస్తున్నట్లు సమాచారం. దీనిపై ఇటీవల స్పందించిన ఆయన ఫోన్‌కాల్స్ వస్తుంటాయి వాటికి మేము సమాధానం చెబుతాము. అదే సమయంలో మాపని మేము చేసుకుంటూ వెళ్తాము. ప్రభుత్వం మాకు ప్రధాన బాధ్యతను అప్పగించింది. దానిని వందశాతం చేయాలనే సంకల్పంతో మావిభాగం పనిచేస్తుంది. చెరువులు, నాలా ఆక్రమణలపై ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. ఆక్రమణ జరిగినట్లు గుర్తిస్తే తప్పనిసరిగా చర్యలు చేపడుతాము ఎటువంటి వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేసిన విషయం తెల్సిందే.

**ప్రజల్లో విశేష స్పందన....**

హైడ్రా విభాగం పనితీరుపై ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఫిర్యాదు చేసిన వెంటనే పరిశీలించడం ఆక్రమణ అతి తేలడంతో ఆలస్యం లేకుండా చర్యలు చేపడుతున్న హైడ్రా విభాగాన్ని ప్రధానంగా కమీషనర్ ఏవి.రంగనాథ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బాచుపల్లి ఎర్రకుంట పరిధిలోని మూడు భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలను పూర్తిగా తొలగించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.సదరు కుంటను ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు.లేని పక్షంలో తమ కాలనీకి దత్తత ఇస్తే తామే అభివృద్ధి చేసుకుంటామని పేర్కోంటూ మరోసారి హైడ్రా విభాగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పేరుకే ఫ్రీక్వెన్సీ !



## -రద్దీ వేళల్లో మెట్రో ప్రయాణికులకు తప్పని నిరీక్షణ
## -3 కోచ్‌లు ఉన్న రైలుకు 6 కోచ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 18 ప్రభాతవార్త**
**"మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. కనీసం నిలబడటానికి చోటు ఉండటం లేదు. కదలడానికి..మెదలడానికి అవకాశం ఉండటం లేదు.. మెట్రో కోచ్‌లు పెంచండి..3కోచ్‌లు ఉన్న మెట్రో రైలును6 కోచ్‌ల వరకు పెంచండి" ఇదీ గత కొన్ని నెలలుగా మెట్రో ప్రయాణికులు చేస్తున్న డిమాండ్ ఇది.**

నగరంలో రద్దీ వేళల్లో మెట్రో రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ప్రతి నాలుగైదు నిమిషాలకోసారి మెట్రో రైలు నడుపుతామన్న అధికారుల మాటలకు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో 8 నుంచి 10 నిమిషాల పాటు నిరీక్షణ తప్పడంలేదని చెబుతున్నారు. కొన్ని సార్లు ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం మూడు మెట్రో కారిడార్ల పరిధిలోని 54మెట్రో స్టేషన్లకు చేరుతున్న ప్రయాణికులు ఫ్లాట్‌ఫారాలపై కిక్కిరిసిపోతున్నారు. రైలులోకి ప్రవేశించే సమయంలోనూ తోపులాట తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక బోగీల్లోనూ బయటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏసీని పెంచడం లేదా తగ్గించడం చేస్తున్నట్లు అధికారులకు చెబుతున్నారు. కానీ.. మధ్యాహ్నం వేళల్లో బోగీల్లో ఉక్కపోతతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు విలవిల్లాడుతున్నారు.మెట్రో రైల్లో ప్రయాణికుల రద్దీ అనుగుణంగా కోచ్‌లను పెంచడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు కోచ్‌లతో నడుస్తున్న మెట్రో రైల్లకు ఆరు కోచ్‌ల వరకు ఏర్పాటు చేసి రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మెట్రో అధికారుల పర్యవేక్షణ లోపంతోనే తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు అంటున్నారు.

**పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య..**

నగరంలో మెట్రో రైళ్లలో రద్దీ క్రమంగా పేరుగుతోందని మెట్రో వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సాధారణ రోజుల్లో మూడు కారిడార్లతో కలిసి రద్దీ 4.5 నుంచి 5లక్షలుకాగా.. సెలవు రోజుల్లో రద్దీ 5.5 లక్షలకుపైగా చేరవవుతోందని పేర్కొన్నాయి. సాధారణ రోజుల్లో అత్యధికంగా ఎల్బీనగర్ – మియాపూర్ నిత్యం సరాసరిన సుమారు 2.75 లక్షల మంది జర్నీ చేస్తున్నారని.. ఆతర్వాత నాగోల్ – రాయదుర్గం మార్గంలో 2.5లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారని.. ఇక జేబీఎస్ – ఎంజీబీఎస్ రూట్‌లలో రద్దీ.... వేలుగా ఉంటుందని తెలిపాయి. నగరంలో అన్ని మెట్రో స్టేషన్ల వద్ద ప్రయాణికులు తమ ద్విచక్ర వాహనాలు, కార్లను పార్కింగ్ చేసుకునే అవకాశం లేకపోవడం, పార్కింగ్ ఉన్న చోట చార్జీల బాదుడు షరామామూలే. సమీప కాలనీలు, బస్తీలకు చేరుకునేందుకు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తోందని ప్రయాణికులు అంటున్నారు. ఇటీవలి కాలంలో పలు మెట్రో స్టేషన్లలో మద్యభాగం (కాన్‌కోర్స్) వద్ద చిరువ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు నిర్మాణ సంస్థ అవకాశం ఇచ్చింది. ఈ ప్రాంతంలో నిత్యావసరాల దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీంతో రైలు దిగిన వెంటనే సిటీజన్లు వస్తువులను కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

**మెట్రో భవన్ ముందు సిపిఎం ధర్నా**

మెట్రో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కోచ్‌లను పెంచాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు ఆపార్టీ నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇప్పటికే మెట్రో భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. రద్దీకి అనుగుణంగా మూడు కోచ్‌లు ఉన్న మెట్రో రైలును ఆరు కోచ్‌ల వరకు పెంచాలని నగర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.అలాగే ఈనెల 25 నుంచి అమలు చేస్తామంటున్నా పెంచిన పార్కింగ్ ఫీజును తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల అవసరాలను, ఇబ్బందులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదని మండిపడ్డారు.


తెప్పోత్సవ వేడుకల్లో పాల్గొన్న దృశ్యం

## ఘనంగా గంగ తెప్పోత్సవ వేడుకలు

**చిన్నకోడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో తెలంగాణ గంగ తెప్పోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ కార్పొరేషన్ ప్రధానకార్యదర్శి గుండు వెంకటేష్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెప్పోత్సవ వేడుకల్లో సిద్దిపేట నుంచి భారీగా తరలివెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాలపందరి, ఆట, పాటలతో ఉత్సహంగా పాల్గొన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది గంగపుత్రులు తరలివచ్చినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఫిషేర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ (గంగపుత్ర) ముందుండి నడిపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నట్లు వివరించారు. ఈసందర్భంగా గుండు వెంకటేష్ మాట్లాడుతూ గంగపుత్రులు ఐక్యంగా హక్కుల సాధన కోసం ముందుకు సాగాలన్నారు.

## ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**


హరీష్‌రావుకు రాఖీ కడుతున్న బిఆర్ఎస్ మహిళ నాయకులు

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కాతమ్ముళ్ళ, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక ఈ రక్షా బందన్ అని అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్లాస్టిక్‌తో తయారు చేసిన రాఖీలు కాకుండా సహజ సిద్దంగా ఉండే ఆకులు, పువ్వులతో ఏటా నుండే తమ్ముళ్లకు అన్నయ్యలకు ఏకో ఫ్రెండ్లీ రాఖీ కట్టాలనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సిద్దిపేటలో హరీష్‌రావుకు బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు రాఖీ కట్టారు. ఈసందర్భంగా వారికి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## సర్వాయిపేట కోట అభివృద్ధికి రూ 4.70కోట్లు

**హుస్నాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** సర్వాయిపాపన్న గౌడ్ సొంత గ్రామమైన హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలం సర్వాయిపేట గ్రామాన్ని పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల దృష్టికి తీసుకెళ్లగా ఆదివార ం రోజున గ్రామ అభివృద్ధితో పాటు కిలాస్‌పూర్ కోటల అభివృద్ధికి రూ 4.70కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రిల, టూరిజంశాక మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ నడియాడిన ప్రాంతాలను టూరిజంగా అభివృద్ది చేసుకుంటే దేశ విదేశాలకు సైతం ఆయన చరిత్ర తెలుస్తోందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## అక్కన్నపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనం దృశ్యం

**అక్కన్నపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యా, బుద్దులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు అంతా ఒక్క దగ్గర కలుసుకుని వారి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఒకరికొకరు వారి బాగోగులు తెలుసుకున్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆ పూర్వ విద్యార్థుల ఆనందాలకు హద్దులు లేకుండా పోయింది.

## కవితారెడ్డికి తెలంగాణ ఐకాన్ అవార్డు


ఐకాన్ అవార్డును అందుకుంటున్న కవితారెడ్డి

**నర్సాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు కవితారెడ్డికి తెలంగాణ ఐకాన్ అవార్డు 2024 అందుకున్నారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతీ లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా కవితారెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఐకాన్ అవార్డు గ్రహీత కవితారెడ్డి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తాను సామాజిక సేవలో బాగంగా పేదింటి ఆడ పిల్లల వివాహాలకు పట్టు చీరెలు, పుస్తె మెట్టెలు, ఇవ్వడం జరిగిందన్నారు. అంతేగాక ఆనాథ ఆశ్రమాలలోని పిల్లలకు వృద్ధులకు, దివ్యాంగులకు తన వంతు సహాయం చేస్తున్నన్నట్లు తెలిపారు. ఈమేరకు తాను చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు రావడం తనకెంతో ఆనందంగా ఉందని కవితారెడ్డి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.



రాజ్‌భవన్‌లో డాక్టర్ ఎం.ఎస్.గౌడ్ రచించిన మైల్ ఆఫ్ స్మైల్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ తదితరులు

# సామాజిక విప్లవకారుడు సర్వాయి పాపన్నగౌడ్


హుస్నాబాద్‌లో సర్వాయి పాపన్న జయంతి వేడుకల దృశ్యం


వెలకట్ట క్రాస్ రోడ్డులో పాపన్న గౌడ్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం


వెల్దుర్తిలో...


శివ్వంపేటలో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు


రామాయంపేటలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు


గజ్వేల్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్‌చేస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త**

బహుజన సామాజిక విప్లవకారుడు, ఛత్రపతి శివాజీ సమకాలీకుడు సర్వాయి పాపన్న గౌడ్ అని హుస్నాబాద్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం సర్వాయి పాపన్న 374వ జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ పాపన్నగౌడ్ పేద కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టి గోల్కొండ సంస్థానాన్ని పాలించి, 17వ శతాబ్దంలోనే బహుజన రాజ్యాన్ని స్థాపించాడని గుర్తు చేశారు. నేటి యువత ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెఏసి కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, సారయ్య, కాంగ్రెస్ నాయకులు కేడం లింగమూర్తి, సిపిఐ నాయకులు గడిపె మల్లేష్, బొమ్మగాని సతీష్, మార్క అనిల్‌గౌడ్, పాల్గొన్నారు.

**కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో...**

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కొమురయ్య, మండల అధ్యక్షులు పచ్చిమట్ల రవిందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు పూదరి రవిందర్, నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**పొట్లపల్లిలో...**

మండలంలోని పొట్లపల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను బురుజు వద్ద నియోజకవర్గ గౌడ సంఘం చైర్మన్ మార్క అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గడ్డం మల్లయ్య, మార్క చంద్రయ్య, తిరుపతిగౌడ్, రాజమౌళి, వెంకటరాజ్యం, ఎల్లయ్య, గౌడ సంఘం డైరెక్టర్లు చెప్యాలగౌడ్, రంగు తిరుపతిగౌడ్, బిసి సెల్ మండల ప్రధాన కార్యదర్శి పాకాల శ్యాంసుందర్‌గౌడ్, బత్తిని మల్లేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**కొండపాకలో...**

**కొండపాక, ఆగస్టు 18, ప్రభాతవార్త :** తెలంగాణలో తొలి రాజ్య స్థాపకుడు శ్రీసర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను ఆదివారం దుద్దెడ ఎల్లమ్మ దేవాలయం వద్ద గౌడ సంఘాల అధ్వర్యంలో ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షడు పెద్దంకుట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దళిత బహుజన వర్గాల తొలి విప్లవ వీరుడు పాపన్నగౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ విగ్రహన్ని వెలికట్ట క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు అయన తెలిపారు. అదేవిధంగా వెలికట్ట క్రాస్ రోడ్డులో, జప్తినాచారంలో, కొండపాకలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జప్తినాచారంలో వద్దకొండ రవీందర్, కొండపాకలో బాలచందర్ గౌడ్, కుకునూరుపల్లి మండల కేంద్రంలో సైతం పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాలులర్పించారు. నాయకులు, శ్రీకాంత్, మాజీ ఎంపిపి బొద్దుల కనకయ్య, బుద్ది రాములు, అన్ని గ్రామాల గౌడ సంఘాల నాయకులు పాల్గొనా న్నరు.

**వెల్దుర్తిలో...**

**వెల్దుర్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద స్థానిక గౌడ కులస్తులు ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 సంవత్సరాల క్రితం మొఘలు సామ్రాజ్యాన్ని భూస్థాపితం చేసి బహుజన వర్గాల కోసం పోరాటం చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ గౌడ్ అన్నారు. దొరల పాలనకు చరమగీతం పాడిన మహాత్ముడని, ఏ ఒక్క కులానికో, వర్గానికో కాకుండా అన్ని కులాలను కలుపుకొని పోయి బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన అధినేత సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. కొన్ని వందల సంవత్సరాల క్రితమే గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని వారు పేర్కొన్నారు. ఈ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఒకరికి ఒకరు మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో లో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ అశోక్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, నాయకులు శివ్వాగౌడ్, వెంకటయ్యగౌడ్, శేఖాగౌడ్, అంజాగౌడ్, శంకరయ్యగౌడ్, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రమేష్‌గౌడ్, దుర్గాగౌడ్ పాల్గొన్నారు.

**శివ్వంపేటలో...**

**శివ్వంపేట, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారం కోసం అహర్నిషలు కృషి చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజా రమణాగౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు కొడకంచి రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బాసంపల్లి రామాగౌడ్, పోచాగౌడ్, కొడకంచి శ్రీనివాస్ గౌడ్, బాసంపల్లి శ్రీనివాస్‌గౌడ్, హరిశంకర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రామాయంపేటలో...**

**రామాయంపేట మున్సిపాలిటీ, ఆగస్టు 18, ప్రభాతవార్త:** బహుజన యుద్ధ నౌక సర్దార్ సర్వాయి పాపన్న అని బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం అన్నారు. ఆదివారం నాడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని రామాయంపేట మున్సిపాలిటీలోని ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో ఉన్నటువంటి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద జయంతి వేడుకలను నిర్వహించారు. సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల ఏళ్ల క్రితం బహుజన చక్రవర్తి అయినటువంటి సర్దార్ సర్వాయి పాపన్న మొగులుల రాజాన్ని అంతమొందించి, పరిపాలించిన బహుజన వీరుడని ఆయన కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపనన్న పోరాట ఫలితాన్ని బహుజన వాదులందరూ అందిపుచ్చుకొని, ముందుకెళ్లి బీసీల రాజ్యం స్థాపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపూరం వెంకటి (వైఎస్), పట్టణ అధ్యక్షుడు రెడ్డమైన నరేష్, సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగర, బీసీ నాయకులు చిలుక వెంకటేశం, అల్లాడి వెంకటేష్, రేవెల్లి వినయ్ సగర, శంకర్‌గౌడ్, మధునాల స్వామి గౌడ్, కన్నాపురం కృష్ణాగౌడ్, ఎల్లాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వికలాంగుల సంఘం నాయకులు కుమ్మరి కుమార్, ధర్మారం శ్రీశైలంతో పాటు తదితర కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**గజ్వేల్ పట్టణంలో...**

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 18 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి. రాజమౌళి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్ బబ్బూరి రజితగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు రాజాగౌడ్‌లు హాజరై పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొగల్ చక్రవర్తితో పాటు బ్రిటీష్ సామ్రాజ్యాన్ని కూడా ఎదిరించి పోరాడిన వ్యక్తి సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగంగారి రాజాగౌడ్, పంజాల గణేష్‌గౌడ్, జంగం వెంకటేష్‌గౌడ్, ఎస్. అశోక్‌గౌడ్, బల రాంగౌడ్, రాజమయ్యగౌడ్, రమేష్‌గౌడ్, బబ్బూరి స్వామి గౌడ్, సత్యనారాయణ, నక్క రేగొండగౌడ్, నక్క రాములు గౌడ్, నర్సింలుగౌడ్, అర్జున్‌గౌడ్, జంగం శ్రీనివాస్‌గౌడ్, పి. నగేష్‌గౌడ్, రాజుగౌడ్, దేవేందర్‌గౌడ్, రవిగౌడ్, రమేష్‌గౌడ్, చంద్రంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఛలో ఇందిరాపార్కు ఆందోళన పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

## 21న ఛలో ఇందిరాపార్కు

**చిక్కడపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగుల పరిరక్షణకు పొందుపర్చిన వివిధ అంశాలను తీర్చాలని డిమాండ్ చేస్తూ 21న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్‌డి) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఛలో ఇందిరాపార్కు కార్యక్రమంలో భాగంగా ధర్నా నిర్వహించబోతున్నట్లు జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి డిఎస్‌డి ప్రధాన కార్యాలయంలో ఆందోళనకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. చేయూత పథకం దివ్యాంగు లకు ఫించన్‌లు రూ.4016 నుంచి రూ.6వేల వరకు పెంచి వెంటనే పంపిణీ చేయాలని, దివ్యాంగులందరికి రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణంకు వసతి కల్పించాలని, దివ్యాంగులకు కేటాయించిన ఉద్యోగాలు క్యాలెండర్ పద్దతిలో భర్తీ చేయడానికి వెంటనే ఆదేశాలివ్వాలని, దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను పటిష్టంగా అమలు చేయాలని, ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద 5శాతం కేటాయించాలని, ప్రతి శాఖలో 5శాతం లేదా రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ కాటమోని వెంకటేశ్‌గౌడ్, ఎస్‌ఎ. ఉద్దీన్, వాసుదేవరావు, ప్రేమ్‌కుమార్, సైఫుద్దీన్, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారమే పాపన్నగౌడ్ అంతిమ లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి కార్యక్రమం ఆదివారం అంబర్‌పేటలోని ఆలీకేఫ్ ఛౌరస్తాలో ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కెపి మురళీకృష్ణ, గౌడ సంఘం ప్రతినిధులు లింగంగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, మేదర సంఘం నాయకులు పల్లి బాలరాజ్ తదితరులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం రావాలని బిసిల్లో ఉండే అట్టడుగు కులాలను సమీకరించి మొగల్ చక్రవర్తిపై దండయాత్ర చేసి గోల్కొండ కోటను స్వాదీనం చేసుకుని బహుజనులు కూడా రాజ్యాధికారం చేస్తారని నిరూపించిన వ్యక్తి పాపన్నగౌడ్ అని చెప్పారు. పాపన్నగౌడ్ స్ఫూర్తితో రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని మురళికృష్ణ స్పష్టం చేశారు.


పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ, తదితరులు


అభివాదం చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, గణేషాచారి, వెంకటేష్

## 26న కలెక్టరేట్‌ల ముట్టడి:జాజుల శ్రీనివాస్‌గౌడ్

**సైఫాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** జనగణనలో బిసి కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఈ నెల 22న హైదరాబాద్ నగరంలో అఖిల పక్ష పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలతో సంయుక్త సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు బిసి కుల సంఘాల జెఏసి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26న రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది బిసిలు 33 జిల్లాల కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తారని, సెప్టెంబరు 6న వేలాది మంది బిసిలతో 'చలో హైదరాబాద్' పేరిట మిలియన్ మార్చ్ తరహాలో బిసి కులగణన మార్చ్ నిర్వహిస్తామని, అవసరమైతే 'రాష్ట్ర బంద్' చేపడతామని హెచ్చరించారు. కామారెడ్డి సభలో ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ చేసిన డిక్లరేషన్ ప్రకారం బిసి కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం జివో నెంబరు 26 జారీ చేసి 150 కోట్లు కేటాయించిందని, కాని ప్రభుత్వం కులగణన చేపట్టలేదని ఆయన ఆరోపించారు. బిసిల కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాంచిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కులగణన, రిజర్వేషన్‌ల పెంపుదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార యాత్ర నిర్వహించడం జరిగిందని, అలాగే ఢిల్లీలో ఎఐసిసి భవన్ ఎదుట ఆందోళన చేపట్టామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు కుందారం గణేషాచారి, వేముల వెంకటేష్, బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వివిధ శాఖ అధికారులతో గాంధీనగర్ కార్పొరేటర్ సమీక్ష

**చిక్కడపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అధికారులతో కలిసి వివిధ ప్రాంతాలను పర్యటించారు. బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.పావనీ వినయకుమార్, జిహెచ్‌ఎంసి ఏఈ అబ్దుల్‌సలామ్, ఇరిగేషన్ ఏఈ శ్యామ్‌సుందర్, వాటర్‌బోర్డు మేనేజర్ కృష్ణ మోహన్, సూపర్‌వైజర్ రవియకుమార్, జిహెచ్‌ఎంసి వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేష్, వాటర్‌బోర్డు వర్క్‌ఇన్‌స్పెక్టర్ శంకర్, హార్టికల్చర్ సర్కిల్ మేనేజర్ భాస్కర్, అసిస్టెంట్ వెంకటేశ్‌తోపాటు వివిధ శాఖల సిబ్బంది తదితరులున్నారు. అరుంధతినగర్‌లో నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణం వద్ద వర్షాలకు వరదనీరు నిలిచిపోయి ఇళ్లల్లోకి వస్తున్న పరిస్థితి తెలుసుకుని పటిష్టమైన శాశ్వ పరిష్కారం కోసం ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మంచినీరు లోప్రెషర్, సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యల తీవ్రత అధికమవుతుందని, వాటి పరిష్కారానికి వాటర్‌బోర్డు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ సూచించారు. బిజెపి నేతలు శ్రీకాంత్, పి.నర్సింగ్‌రావు, సాయికుమార్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, నీరజ్, శ్రీనివాస్‌గౌడ్, బస్తీవాసులు చిప్స్‌రాజు, ప్రకాశ్, రాజయ్య, నర్సింగ్, ఆరోగ్యం, సాయిలు, లలిత, భారతమ్మ, యాదగిరి, రాజు పాల్గొన్నారు.

## బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న

**-సర్దార్ పాపన్న సినీ హీరో పంజాల జైహింద్‌గౌడ్**

**చిక్కడపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న అని సర్దార్ పాపన్న సినీ హీరో పంజాల జైహింద్‌గౌడ్ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉడుతల బాలకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయిపాపన్న 374వ జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పంజాల జైహింద్‌గౌడ్ మాట్లాడుతూ ఔరంగాజేబుకు తెలంగాణ దెబ్బ రుచి చూపించిన సాయుధ పోరాట యోధుడు అని, బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన ధీశాలి అని అన్నారు. ఉడుతల బాలకృష్ణగౌడ్ మాట్లాడుతూ బహుజన ప్రజారాజ్య స్థాపకుడు అని అన్నారు. బిజెపి ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద గౌడ్ జేసీ లీగల్ సెల్ సలహాదారు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సంఘం ఉపాధ్యక్షుడు టి.శ్రీనివాస్‌గౌడ్, ఆర్గనైజర్ శ్రీకాంత్‌గౌడ్, మీడియా సెల్ అధ్యక్షుడు అంజిగౌడ్, కోశాధికారి హిమగిరిగౌడ్, బిజెపి నేతలు నర్సింగ్ గౌడ్, మహిళావిభాగం కార్యదర్శి ఎం.వాణిగౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు స్వరూపాగౌడ్, రాష్ట్ర నాయకులు రమేశ్‌గౌడ్, వీరయ్యగౌడ్, లక్ష్మణ్ గౌడ్, నగర ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, జంగంగౌడ్, కోనేటి ప్రభులింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు దోహదపడే కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేపట్టాలి

**-మాజీ ప్రధాని పివి కుమారుడు, గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పి.వి.ప్రభాకరరావు**

**చిక్కడపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** యువతకు దోహదపడే కార్యక్రమాలు ప్రతి ఒక్కరు చేపట్టాలని మాజీ ప్రధానమంత్రి పివి.నర్సింహారావు కుమారుడు, గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పి.వి.ప్రభాకరరావు అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఏఎస్ఈజెడ్ వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి.వి.ప్రభాకరరావు హాజరై చెట్లునాటే అంశంపై కార్యక్రమం నిర్వహించి ఎంపిక చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. యువత పెడదారిన పడకుండా చైతన్యవంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ రవికుమార్, మల్కాజిగిరి క్రైం విభాగం ఇంచార్జ్ సాల్మన్, జిహెచ్‌ఎంసి హార్టికల్చర్ అధికారి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉమామహేశ్వరి'కి 'జమున-వంశీ జాతీయ పురస్కారం-2024

**చిక్కడపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** వంశీ ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రజానటి, కలాభారతి, పూర్వ లోకసభ సభ్యురాలు డాక్టర్ జమున రమణారావు 88వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సాంస్కృతిక హరికథా భాగవతారిణి పద్మశ్రీ 'ఉమామహేశ్వరి'కి 'జమున-వంశీ జాతీయ పురస్కారం-2024 ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహక సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, వంశీ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ వివరించారు. 23న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ పూర్వ సలహాదారు కె.వి.రమణాచారి హాజరై పురస్కారాన్ని ప్రదానం చేస్తారని, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో జమున కుమార్తె జూలూరి స్రవంతి, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, జమున మనుమడు అవిష్ జూలూరి, ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె.వి.కృష్ణకుమారి, ప్రముఖ నాట్యగురువు డాక్టర్ కళాకృష్ణ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'మీరజాలగలడా నాయావతి' పేరుతో జమున నటించిన చిత్రాల నుంచి సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు వైఎస్.రామకృష్ణ, సాయిమేఘన, తుషార నిలయ, వీణ, గంటి శైలజ, నేమాన లలిత తదితరులు గానం చేస్తారని, వ్యాఖ్యాత్రిగా సుధామయి వ్యవహరిస్తారు.

## వైషమ్యాలను రెచ్చగొడుతున్నారు

**-వీరన్నపేట భూ వ్యవహారంలో పోలీసులకు ఫిర్యాదు**



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మహామ్మద్ ఆలీ

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 18,(ప్రభాతవార్త):** తన తల్లి పేరిట ఉన్న భూమిలో కొంతమంది గ్రామస్తులు కలుగజేసుకుని అనుమతి లేకుండ ప్రవేశించి వర్గ వైశామ్యాలను సృష్టించే కుట్ర చేస్తున్నారని పెద్ద ఎల్కిచర్ల గ్రామానికి చెందిన మోహమ్మద్ ఆసిఫ్ ఆలీ అనే బాదితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాదితుడు చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌లో చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదులో పేర్కోన్నారు. జిల్లెడు చౌదరిగూడ మండలం సర్వే సర్వేనెంబర్ 38లో నాలుగు ఎకరాల 11గుంటల భూమి తన తల్లి జహెదాబేగం పేరిట ఉందని పేర్కోన్నారు. ఇట్టి భూమిలో కొంతమంది కావాలని ఉద్దేశంతో తమ భూమిలో రాము అనే వ్యక్తి అక్రమంగ చొరబడి మరి కొంతమందితో కలిసి తమను బయబ్రాంతులకు గురిచేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. మత కలహాలను సృష్టించే విదంగ ప్రయత్నిస్తున్నారని సదరు వ్యక్తులపై చట్టరిత్య చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని చేయాలని ఫిర్యాదులో పేర్కోన్నట్లు తెలిపారు. రెవేన్యూ రికార్డులో తమ పేరిట ఉన్న భూమిలో అకారణంగ ప్రవేశించి తమను బెదిస్తున్న రాము తదితరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భూమికి సంబంధించిన పత్రాలను పోలీసులకు అందజేసినట్లు బాధితుడు మహమ్మద్ అసీవ్ ఆలీ తెలిపారు.

### ఘనంగా పద్మశాలీ కుల దేవతల విగ్రహ ప్రతిష్ట పూజలు


అవుశాపూర్‌లో పద్మశాలీ కులదేవతల విగ్రహా ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ కావేరి దంపతులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మండలంలోని అవుశాపూర్ గ్రామంలో పద్మశాలీ కుల దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి దంపతులు పాల్గొని పూజలు చేశారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన పూజ కార్యక్రమాలు ఆదివారం ఎంతో ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచ్ దంపతులు విగ్రహాలను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపన పూజ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌తో పాటు బీజేపీ నాయకులు ఏనుగు మశ్చేందర్ రెడ్డి, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మచ్చ సుదర్శన్, విశ్వనాథం, బాస్కర్, శ్రీనివాస్, ప్రభాకర్, వెంకటేశ్, గుమ్మడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన కుంగ్‌ఫూ విద్యార్థులు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 18,(ప్రభాతవార్త):** జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌లో జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎలల్కిచర్ల బ్రూస్లి కుంగ్ ఫూ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం మొహినాబాద్‌లో గల పెయిర్ ప్యాక్స్ ఇండోర్ స్టేడియంలో రెడవ జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహించినట్లు మాస్టర్ నందు తెలిపారు. ఈ పోటీల్లో డి శ్రీను సినియర్ కటాస్ విభాగంలో మొదటి స్థానం సాదించినట్లు ఆయన తెలిపారు. అనంతరం శ్రీనుకు ఆర్గనైజర్ సాయినాథ్, కేశవ్, రమేష్, రవి, శ్రీను మాస్టర్ చేతుల మీదుగ మెడల్, సర్టిఫికెట్‌లను అందజేసినట్లు తెలిపారు.

### ముదిరాజ్ భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**-జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు లొంక నర్సిములు**

**పెద్దేముల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ముదిరాజుల అభ్యున్నతికి పాటుపడుతున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముదిరాజ్ భవన నిర్మాణానికితాండూరు బైపాస్ రొడ్డు పక్కన స్థలం కేటాయించడం సంతోషకరమని ఏ బ్లాక్ అధ్యక్షుడు, జిల్లా యువజన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడులొంక నర్సిములు అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండల కేంద్రంలో నిర్వహించిన ముదిరాజ్ సంఘం సమావేశంలో లొంక నర్సిములుమాట్లాడుతూ ముదిరాజ్ భవన నిర్మాణానికి ప్రతి ఒక్క ముదిరాజ్ కృషిచేసి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘంమండల అధ్యక్షులు మల్లేశం, నాయకులు పి.ఉత్తంచంద్, బాతుల వెంకట్, మల్లప్ప, బుద్దారం వెంకటయ్య, లొంక రాములు,చంద్రశేఖర్,వెంకటేష్, అనంతయ్య, అంజిలయ్య, అనిల్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నటరాజ్ యాదయ్య సేవలకు గుర్తింపు

**ఆమనగల్లు, ఆగస్టు18, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణానికి చెందిన నటరాజ్‌యాదయ్యగుప్తకు జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ సేవా పురస్కారం అందించింది. అసోసియేషన్ జల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్ చేతుల మీదుగా ప్రశంస పత్రం, జ్ఞాపికను అందుకున్నారు. లయన్స్‌క్లబ్ తరపున యాదయ్యగుప్త పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడమే కాకుండా 50 సంవత్సలుకు పైగా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు రంగంలో సేవలందిస్తున్నందుకు గాను సేవా పురస్కారం అందించింది. హైదరాబాద్ నగరంలో నిర్వహించిన పురస్కార ప్రదానం వేడుకల్లో నిర్వహకులు నటరాజ్‌యాదయ్యలక్ష్మీ దంపతులను శాలువాతో సత్కరించి మెమెంటో, ప్రశంస పత్రం అందించారు. ఈసందర్బంగా యాదయ్యగుప్త మాట్లాడుతూ సేవా పురస్కారం లభించడం గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ సేవలందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సేవా పురస్కారంకు ఎంపిక చేసినందుకుగాను జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యవసాయాధికారిగా శ్రీనివాస్‌గౌడ్


ఏఓ శ్రీనివాస్‌గౌడ్‌ను పూలమాలతో స్వాగతం పలుకుతున్న రైతులు

**ఆమనగల్లు, ఆగస్టు18, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల వ్యవసాయాధికారిగా శ్రీనివాస్‌గౌడ్ పదవి బాధ్యతలు స్వీకరించారు. 11ఏళ్ళుగా ఇక్కడ పనిచేస్తున్న అరుణ కుమారి మాడ్గుల మండలానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో సూర్యపేట జిల్లా మేళ్ళ చెరువు నుండి శ్రీనివాస్‌గౌడ్ ఇక్కడికి బదిలీపై విచ్చేసారు. శనివారం శ్రీనివాస్‌గౌడ్ చార్జి తీసుకోగా పలువురు రైతులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో శ్రీనివాస్‌గౌడ్ ఇక్కడ మండల విధులు నిర్వర్తించి మంచి పేరు సంపాధించుకున్నారు. కాగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో రైతులు రమేశ్ తదితరులు ఉన్నారు.


పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే


పూడూరు మండల మన్నెగూడ చైరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు,తదితరులు


పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తునన ఎమ్మెల్యే, తదితరులు


పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే తదితరులు.


ఆమనగల్లులో నివాళులు అర్పిస్తున్న గౌడ సమాజ వర్గ ప్రజలు


పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు.


సమావేశంలో మాట్లాడుతున్న మండల నాయకులు


మాడ్గులలో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ్ సంఘం నాయకులు

# సర్వాయి పాపన్న జీవితం ఆదర్శప్రాయం

**షాద్‌నగర్ పట్టణంలో..**

**షాద్‌నగర్ అగస్టు18 ప్రభాతవార్త, :** ఈ యుద్దాలు వద్దురా కొడుకా...మనది గీత వృత్తి , అది చేసే మనం బ్రతకాలి అని తల్లి అన్నప్పుడు తాటి చెట్టు ఎక్కితే ఏమొస్తదమ్మా.. ముంతకల్లు తప్ప, కొడితే గోల్కొండను కొట్టాలి, రాజ్యపాలించాలి అని అన్నాడు అదేవిదంగా గోల్కొండను కొట్టి చక్రవర్తిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రకు ఎక్కాడని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కొనియాడారు.ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఆయన జయంతి సందర్బంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నక్కల మల్లేష్ గౌడ్, పోలెపల్లి శ్రీనివాస్ గౌడ్, రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, కొమ్మగంటి జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పూడూరు మండలంలో**

**పూడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** బహుజనరాజ్య స్థాపకుడు సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల సమాచారహక్కు చట్టం కన్వీనర్ దేవనోనిగూడెం వెంకటయ్య పేర్కొన్నారు.ఆదివారం సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి సందర్బంగా పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్,శ్రీనివాస్,జిల్లా గౌడసంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్,మండల గౌడ సంఘం నాయకులు రాజేందర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్,గంగాధర్‌గౌడ్,సుధాకర్‌గౌడ్,శ్రీశైలంగౌడ్,దయానంద్‌గౌడ్,వివిధ పార్టీల నాయకులు అబ్రమం, రయాస్‌ఖాన్,బాలమణి,ఆయా గ్రామాల గౌడసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

**షాద్‌నగర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ..**

తెలంగాణ ధీరత్వానికి ప్రతిక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అనీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్బంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఆ మహా వీరుడి విగ్రహానికి స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు మాజీ ఎంపీపీలు వన్నాడ ప్రకాష్‌గౌడ్, శివశంకర్ గౌడ్, రంగయ్యగౌడ్, జె.గోవర్ధన్‌గౌడ్, కట్ట వెంకటేష్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, దంగు శ్రీనివాస్‌యాదవ్, కొంకళ్ల చెన్నయ్య, మద్దూరి ఆశోక్‌గౌడ్, పాలకొండ రజనీకాంత్, కాంగ్రెస్ సీనియర్ నేత కృష్ణారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రఫిక్ పటేల్, ఉబేద్ పటేల్, టీజీ శ్రీనివాస్, కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, గౌడ సంఘం నేత ఎడ్ల శ్రీకాంత్‌గౌడ్, బొమ్మ అంజయ్యగౌడ్, అభిగౌడ్, జర్నలిస్టులు రాఘవేందర్‌గౌడ్, భానుచందర్‌గౌడ్, దర్శన్‌గౌడ్, శ్రావణ్ గౌడ్ పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ...**

బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. అదేవిధంగా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయంలోని గౌడన్నలకు అన్ని రంగాలు అభివృద్ధి జరిగిందని అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, వైస్ ఛైర్మన్ ఎమ్మెస్ నటరాజన్, గౌడ సంఘం నేత కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా జయంతి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌గౌడ్, మాజీ ఎంపీపీ రంగయ్యగౌడ్, మద్దూరి ఆశోక్‌గౌడ్, పాలకొండ రజనీకాంత్‌గౌడ్, రాములుగౌడ్, నక్క వెంకటేష్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, దర్శన్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్, నర్సింహులు గౌడ్, అభిగౌడ్, రాముగౌడ్, మణిగౌడ్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్ మండలంలో...**

**షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 18, (ప్రభాతవార్త) :** వందల ఏళ్ల క్రితమే నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి సామాజిక న్యాయమే ధ్యేంగా పోరాడిన ధీరుడు సర్వాయి పాపన్నగౌడ్ సేవలు మరువలేనివని గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి, అనిమి ముకుందంగౌడ్, అఖిల్‌గౌడ్, మట్ట శ్రీశైలంగౌడ్, మాజీ డీప్యూటీ సర్పంచి రాజు, దొడల వెంకటేష్, అనిమి శివరాజ్ గౌడ్, జంగారి రవి, అనిమి రాఘు, నర్సింలుగౌడ్, సాయి, శంకరయ్య, మట్ట వెంకటేష్‌గౌడ్, కవాలి నర్సింలు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ ఆధ్వర్యంలో...**

బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు అందెబాబయ్య ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెట్ల వెంకటేస్, కుమార్‌గౌడ్, సాయి గౌడ్, శ్రీనివాసచారి, కిరణ్‌గౌడ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ఆమనగల్లు పట్టణంలో...**

**ఆమనగల్లు, ఆగస్టు18, ప్రభాతవార్త:** బహుజన వీరుడు, బహుజన చక్రవర్తి, బహుజన నాయకుడు సర్వార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం అన్ని తరాలకు ఆదర్శప్రాయమని గౌడ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు చుక్కా అల్లాజీగౌడ్, జిల్లా నాయకుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి పురస్కరించుకుని మండల చుక్క నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారి రాజీవ్‌చౌరస్తాలో పాపన్నగౌడ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గజ్జె వెంకటయ్య, పల్లె నారాయణ, గజ్జె వెంకటయ్య, బాలకృష్ణ, చుక్క వెంకటయ్య, లక్ష్మీపతి, నరసింహ్మా, కుమార్‌గౌడ్, గుండ్రాతి కుమార్‌గౌడ్, అల్లాజీగౌడ్, గోదా సతీష్, ముకురాల శివ, రాఘవేందర్, దూసకంటి ఆంజనేయులు, పల్లె శివ, సాయి, బుల్లెట్ శివ, బన్నీ, మారెపల్లి శివ, నారమోని నరేశ్, పాపిశెట్టి రాము, పత్యానాయక్, ఉప్పల రాములు తదితరులు ఉన్నారు.

**బొంరాస్‌పేట్ మండలంలో...**

**బొంరాస్‌పేట్, ఆగస్టు18, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్, దుద్యాల్ రెండు మండలల్లో సర్ధార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను గౌడసంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు.తుంకిమెట్ల చౌరస్తాలో భారతీ య జనతాపార్టీ మండలశాఖ అధ్వర్యంలో విగ్రహనికి పూలమాలవేసి జయంతి వేడుకలను నిర్వహించారు.పాపన్న గౌడ్ నిరుపేద కుటుంబంలో పుట్టిన కూడా నిరంతరం ప్రజల కోసం పోరాడి రాజుగా పరిపాలనకొనసాగించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా కార్యదర్శి బాబయ్య నాయుడు,కార్యవర్గ సభ్యులు నాగురావు,ఐటీసెల్ కన్వీనర్ ముకుందు,మండల అధ్యక్షులు నర్సిములు,మాజీ ఎంపిటీసి శ్రావణ్‌గౌడ్,బీసీ,ఎస్సి మోర్చ అధ్యక్షులు శ్రీనివాస్, జనార్దన్,జగదీష్,ప్రతాప్,శంకర్,నర్సిములు,మహేందర్‌గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ మండలంలో...**

**షాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** తెలంగాణ ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం సర్దార్ పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని సంఘం ఆవరణలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గజేందర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శివలింగంగౌడ్, గణేష్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, ఆశోక్‌గౌడ్, శివరాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

**దౌల్తాబాద్ మండలంలో...**

**దౌల్తాబాద్,ఆగస్టు 18,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సంధర్బంగా మండలానికి చెందిన ఆయా పార్టీల నాయకులు,గౌడ సంఘం నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు,వివిధ పార్టీల నాయకులు,యువకులు,పాల్గొన్నారు.

**కడ్తాల్, మండలంలో**

**కడ్తాల్,ఆగస్టు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో తెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు మొగలాయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని నా వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండలగౌడ సంఘం అధ్యక్షుడు మాలె మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి మాలె శ్రీశైలంగౌడ్, టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,కేశవులుగౌడ్, రమేష్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, తాలూకా గౌడ సంఘం కార్యదర్శి మాలె శ్రీనివాస్‌గౌడ్, శివగౌడ్, మాజీ జడ్పిటిసి దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహరెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ అయ్యగారు, బాలాజీ సింగ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

## నూతన గ్రామ పంచాయతీగా రాకంచెర్ల ఏర్పాటు పట్ల హర్షం

**-తిరుమల నాథస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ జాజుల నర్సింహ్మా**

**పూడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని తిర్మలాపూర్ అనుబంధ గ్రామం రాకంచెర్లను నూతన గ్రామపంచాయతీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో రాకంచెర్ల శ్రీ తిరుమల నాథస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ జాజుల నర్సింహ్మా హర్షం వ్యక్తం చేశారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నా గతంలో కొన్ని అనివార్య కారణాలవల్ల నూతన పంచాయతీగా ఏర్పాటు కాలేదని వివరించారు.నూతన పంచాయతీ ఏర్పాటుకోసం గతంలో తాను దీక్షచేశానని,మజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి కూడా ప్రభుత్వ యంత్రాంగానికి నివేదికలు అందజేశారని తెలిపారు.ఇప్పటికైనా ఈ గ్రామ ప్రజల అవస్థలను గుర్తించి తిర్మలాపూర్‌నుండి వేరు చేసి రాకంచెర్ల గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు.

### యువత స్వయం కృషితో ఎదగాలి : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 18, (ప్రభాతవార్త) :** యువత స్వయం కృషితో ఎదగాలని, పది మందికి ఉపాధి కల్పించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని కేశంపేట రోడ్డులో బాబాయ్ టీ స్టాల్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాజమాని గణేష్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు విశాల విశ్వం, నడికూడ సరితాయాదగిరి యాదవ్, కాంగ్రెస్ నాయకులు కొంకళ్ల చెన్నయ్య, తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్‌యాదవ్, నడికూడా యాదగిరి యాదవ్, నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, అర్జున్ లక్ష్మణ్, పిప్పళ్ల వెంకటేష్‌యాదవ్, విజయ్ కుమార్, వన్నాడ ప్రకాష్‌గౌడ్, బీరయ్య, కాలనీ వాసులు రఘునాథ్‌యాదవ్, దర్శన్ గౌడ్, మనీస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

**బొంరాస్‌పేట్,ఆగస్టు18,ప్రభాతవార్త :** దుద్యాల్ మండలం ఈర్లపల్లి గ్రామంలో వీరన్నగుట్టపై వెలసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవం జాతర సోమవారం నాడు నిర్వహించడం జరుగుతుందని స్థానికప్రజలు తెలిపారు.ఈర్లపల్లి గ్రామం నుండి ఆదివారం సాయంత్రం 5గంటలకు వీరభద్రస్వామి విగ్రహంకు పల్లకిసేవ కార్యక్రమం గ్రామం నుండి దేవాలయం వరకు నిర్వహించడం జరుగుతుందని పల్లకిసేవ అనంతరం దేవాలయం దగ్గర సోమవారం జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ జాతరకు ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### ప్రొఫెసర్ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిసిన ఉపాధ్యాయులు

**బొంరాస్‌పేట్,ఆగస్టు18, ప్రభాతవార్త :**


కోదండరాంను కలిసిన టీవివి నాయకులు.

తెలంగాణ ఉద్యమ రథ సారథి,ఉద్యమ సమయంలో ప్రజలను ఏకం చేసి అసింహాయుతంగా ఉద్యమంలో పాల్గొనేవిధంగా చేసిన ప్రొఫెసర్ కోదండ రాంను ప్రభుత్వం ఎమ్మెల్సీగా ప్రమాణస్వీ కరం చేసిన సందర్బంగా మండల విద్యావంతుల వేదిక నాయకులు కె రవీందర్‌గౌడ్,బాకారం చంద్రశేఖర్,గౌరారం గోపాల్ మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లోని అయన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నీళ్ల,నిధులు,నియామకలపైన కొనసాగిందని రాష్ట్ర సాధనకోసం అనేక మంది అమరులైనారు.అమరుల ఆశాయలకు అనుగుణంగా పనిచేయాలని ప్రతినిత్యం పోరాడుతూ ప్రజలమనిషిగా ఉన్న కోదండరాంకు తెలంగాణ ప్రభుత్వం పాలనలో భాగస్వామ్యం చేస్తే ఉద్యమకాంక్షలు నెరవేరుతాయని భావించి శాసనమండలి సభ్యులుగా అవకాశం కల్పించడం అభినంధనీయం అన్నారు.తెలంగాణ విద్యావంతు వేదిక ఉమ్మడి మహబుబ్‌నగర్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నాయకులు కలిసి అయనకు శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు.ప్రభుత్వానికి వారధిగా ఉంటూ బలహీన వర్గాలకు భవిష్యత్తుకు ప్రభుత్వం చేయవలసిన భరోసాను కల్పించాలన్నారు.నీళ్ళ,నిధులు,నియామకలు పూర్తి స్థాయిలో సంపూర్ణంగా జరగాని,విద్యా,వైద్యం,వ్యవసాయరంగాల అభివృద్ధి బాధ్యతలను అయన తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సోమశేఖర్,టీవివి జిల్లా అధ్యక్షులు వెంకట్‌రాములు,టీవివి రాష్ట్ర నాయకులు మదన్‌రెడ్డి,ఎంఈఓ హరిశ్చందర్,గ్రంథాలయకర్త హన్మయ్య పాల్గోన్నారు.

# అసోసియేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తే వేటు తప్పదు

**-ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కమల్ అత్తర్**

**- వ్యతిరేకంగా పనిచేసిన నలుగురి సభ్యత్వం రద్దు**

**తాండూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తే చర్యలు తప్పవని అసోసియేషన్ అధ్యక్షులు కమల్ అత్తర్ అన్నారు. తాండూరు పట్టణంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కమల్ అత్తర్ ఆద్వర్యంలో కమిటీ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసోసిఏషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న నలుగురు సభ్యులు అబ్దుల్ హాది షహరి, కుర్షిద్ హుసేన్, సత్తార్ ముజాహిద్, అబ్దుల్ రెహామాన్ ముజాహిద్‌లను సభ్యత్వం నుండి తొలగిస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఖాలీద్ సైపుల్ల ప్రకటించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. అనంతరం సమావేశంలో అసోసియేషన్‌కు సంబందించి దుకాణాలలో అద్దె చెల్లించిన కిరాయి దారులను ఖాళీ చేయించి కొత్త వారికి దుకాణాలను కేటాయించాలని, ఒకరు అద్దెకు తీసుకొని మరోకరికి ఇవ్వకుండా చర్యలు తీసుకునేలా తీర్మానించినట్లు వెల్లడించారు. ఈ సందర్బంగా అధ్యక్షులు కమల్ అత్తర్ మాట్లాడుతూ.. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆద్వర్యంలో నిరుపేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. ముస్లింల అభ్యున్నతి, సంక్షేమం కోసం పారదర్శకంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బోర్డు సలహాదారులు అహాద్, మాజీ అధ్యక్షులు బాబర్, మహమ్మద్ అలీమ్, మమమ్మద్ తాయర్ ఖురేషి, మహమ్మద్ ఫారూక్, కోశాధికారి యునూస్, ఉపాధ్యక్షులు సయ్యద్ బాసిత్ అలీ, కార్యవర్గ సభ్యులు సలీం, ఖయ్యూం, సాజిద్, పాషా ఖురేషి, సిరాజుద్దీన్, హమీద్, లతీఫ్, అసద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షులు

## విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

**- షాద్‌నగర్ ట్రాఫిక్ సబ్ ఇన్స్‌స్పెక్టర్ రవీందర్‌నాయక్**



విద్యార్థులకు బెల్టులను ప్రధానం చేస్తున్న ట్రాఫిక్ సబ్‌ఇన్స్‌స్పెక్టర్, తదితరులు

**షాద్‌నగర్, ఆగస్టు 18, (ప్రభాతవార్త) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో న్యూ మాంక్స్ కుంగ్ ఫు ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టు గ్రేడ్ పరీక్షలకు ముఖ్యఅతిథులుగా స్థానిక ట్రాఫిక్ సబ్ ఇన్స్‌స్పెక్టర్ రవీంద్రనాయక్ హాజరై ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు బెల్టులు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆత్మరక్షణకు శారీరక దృఢత్వానికి దోహదపడే ఈ శిక్షణను విద్యార్థులు చిన్నతనం నుంచే యుద్ధ విద్యలలో చదువులో కూడా ముందుండాలని, ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే ఆరోగ్యంతో పాటు, క్రమశిక్షణను కూడా అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం షాద్‌నగర్‌లో కుంగ్ ఫు శిక్షణను ఇస్తున్న మాస్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కుంగ్ రాష్ట్ర అసిస్టెంట్ చీఫ్ ఇన్స్‌ట్రక్టర్ నక్క బాల్‌రాజ్, రంగారెడ్డి జిల్లా చీఫ్ ఇన్స్‌ట్రక్టర్ జి.రమేష్, స్థానిక కుంగ్ ఫు మాస్టర్ నరేష్, నవపేట్ మండల మాస్టర్ బాల్‌రాజ్, పద్మావతి కన్వెన్షన్ హాల్ అధినేత రమేష్, యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, ఎస్ఆర్‌కె ఫిట్నెస్ క్లబ్ ట్రైనర్ షారుఖ్‌ఖాన్ కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపల్ నవీన్, రంగంపల్లి మాజీ సర్పంచి శ్రీనివాస్‌యాదవ్ తదితర విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### 20నుంచి శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

**కొడంగల్,ఆగష్టు 18ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలోని బ్రహ్మణవాడలో కొలువుదీరిన శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు శ్రీగురురాఘవేంద్ర సేవా సమితి సభ్యులు అక్కి శ్రీనివాసామూర్తి,లోకూర్తి జయతీర్ధచారి తెలిపారు.ఈనెల 20న సుప్రభాతంతో మొదలుకొని అష్టోత్తర పారాయణము,తులసి అర్చన, భజన, పల్లకి సేవ 21న స్వామివారి రథోత్సవం22న స్వామివారి విశేష అలంకరణలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు,భజన తదితర కార్యక్రమాలతో ఆరాధనోత్సవాలు ముగుస్తాయన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు న్యాయం చేయాలి

**-సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య**

**కొడంగల్,అగష్టు 18 ప్రభాతవార్త**


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం స్వచ్ఛంధ సంస్థకు అప్పగించడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య అన్నారు.మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆదివారం ఆయన కొడంగల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు గత 22 సంవత్సరాలుగా శ్రమను నమ్ముకొని మధ్యాహ్న భోజన కార్యనిర్వహణ కొనసాగిస్తున్నారని అన్నారు.స్వచ్ఛంధ సంస్థకు అప్పజెప్పడంతో కార్మికులు జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని అన్నారు.మధ్యాన్న భోజన కార్మికులకు కనీస వేతనంగా రూ.10వేలు అందిస్తు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.ప్రభుత్వం పునరాలోచించి కార్మికులకు న్యాయం చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో మధ్యాన్న భోజన కార్మికుల సంఘం తాలూకా అధ్యక్షులు బి.జలక్ష్మీ,జయమ్మ,ఆశమ్మ,సులోచన,నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల అదుపులో సిసి కెమెరాల పాత్ర కీలకం

**-యాలాల ఎస్ఐ శంకర్**

**యాలాల ఆగస్టు 18,ప్రభాతవార్త :**

నేరాల అదుపులో సిసి కెమెరాల పాత్ర కీలకమని యాలాల ఎస్ఐ.శంకర్ పేర్కొన్నారు.యాలాల మండల కేంద్రంలో సిసి కెమెరాల ఏర్పాటులో భాగస్వామలు కావానే ఎస్ఐ పిలుపుతో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి స్పందించారు.కెమెరాలఏర్పాటనకు ఆర్థిక సహాయం అందిస్తామని ఆయన మందుకొచ్చారు.ఆదివారం యాలాల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సిసి కెమెరాలను ఆయన విరాళంగాఅందజేశారు.రాజేందర్‌రెడ్డి సహాయంతో పొందిన సిసి కెమెరాలను మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని ఎస్ఐ తెలిపారు.నేరాలు జరగకుండా కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు.అలాగే నేరాలు జరిగిన తర్వాత సిసి కేసులను చేధించడంలో కెమెరాల సహాయం ఎంతోఉపయోగ పడుతున్నాయన్నారు.అడిగిన వెంటనే కెమెరాల ఏర్పానకు ముందుకు వచ్చిన రాజేందర్‌రెడ్డిని ఎస్ఐ అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కంగ్రెస్ నాయకులు నాగయ్య,ఎమ్‌సి డౌరెక్టర్ శ్రీనివాస్, మోహిజ్,మారుతి,అశోక్,లాలు,నర్సిములు,ఉప్పరి నర్సిములు,అజీజ్ పాల్గొన్నారు.